## అంజన్‌కుమార్‌యాదవ్ చౌకబారు విమర్శలు మానుకోవాలి

● బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి ముఠా గోపాల్



ముషీరాబాద్, నవంబర్ 16: ముషీరాబాద్ కాంగ్రెస్ అభ్యర్థి అంజన్‌కుమార్‌యాదవ్ చౌకబారు విమర్శలు మానుకోవాలని ముషీరాబాద్ బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి ముఠా గోపాల్ హితవు పలికారు. గురువారం ముషీరాబాద్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ అంజన్ ప్రచారానికి అనుమతులు రద్దు కావడానికి తమకు ఏమిటి సంబంధం అని ప్రశ్నించారు. ఈ ఆరోపణలతో అంజన్‌కుమార్ యాదవ్ తన ఓటమిని అంగీకరించినట్లు అయిందని పేర్కొన్నారు. కులం ఒక్కటి అయినంత మాత్రాన అందరు బంధువులు కారని, చిక్కడపల్లి ఏసీపీది, తనది ఒకే కులం అయినప్పటికీ తమ మధ్య బంధుత్వం లేదని స్పష్టం చేశారు. ఏసీపీ, తమకు బంధుత్వం ఉన్నట్లు అంజన్‌కుమార్ యాదవ్ నిరూపించగలరా అని సవాల్ విసిరారు. తమ బంధువే అయితే మూడు రోజుల క్రితం ఏసీపీ తన వాహనాన్ని ఎందుకు సీజ్ చేశారని ప్రశ్నించారు. పోలీసులతో ఏమైనా సమస్యలు ఉంటే లీగల్‌గా, చట్టపరంగా చూసుకోవాలని కోరారు. ఓడిపోతామనే భయంతో అధికారులతో తనకు లేనిపోని బంధుత్వాలను అంటగట్టి ప్రచారం చేయడం తగదన్నారు. ముషీరాబాద్ నియోజకవర్గంలో తమ కుమారుడు జయసింహ గత పది సంవత్సరాలుగా రాజకీయ కార్యక్రమాలను నిర్వహిస్తున్నాడని ప్రజల్లో మంచి ఆదరణ సంపాధించారని, ప్రజల్లో వస్తున్న ఆదరణ చూసి ఓర్వలేకనే ఇలాంటి చౌకబారు విమర్శలకు దిగుతున్నారని మండిపడ్డారు. 15 రోజుల్లో కాంగ్రెస్ ప్రభుత్వం వస్తుందని అంజన్‌కుమార్ యాదవ్ పగటి కలలు కంటున్నారని ఎద్దేవ చేశారు. పాత బస్తీలో మాదిరిగా రౌడీయిజం, గుండాయిజం చేస్తే ముషీరాబాద్ నియోజకవర్గ ప్రజలు సహించరని ఆయన హెచ్చరించారు.

## కాచిగూడ పోలీసుల ఫ్లాగ్‌మార్చ్..



కాచిగూడలో ఫ్లాగ్ మార్చ్ నిర్వహిస్తున్న ఏసీపీ శ్రీనివాస్, సీఐ రామలక్ష్మణరాజు, ఎస్సైలు, పోలీసులు

కాచిగూడ, నవంబర్ 16: నవంబర్ 30వ తేదీన జరుగనున్న అసెంబ్లీ ఎన్నికల్లో ఎలాంటి భయాందోళనలకు గురికాకుండా ప్రజలు నిర్భయంగా ఓటు హక్కును వినియోగించుకోవాలని ఈస్ట్‌జోన్ డీసీపీ సునీల్‌దత్ ఓటర్లకు పిలుపునిచ్చారు. ఓటు హక్కును ఎన్నికల్లో నిర్భయంగా వినియోగించుకోవాలని కోరుతూ కాచిగూడ ఏసీపీ కస్తూరి శ్రీనివాస్, ఇన్‌స్పెక్టర్ రామలక్ష్మణరాజు ఆధ్వర్యంలో గురువారం సాయంత్రం కాచిగూడ పీఎస్ పరిధిలోని కాచిగూడ టూరిస్ట్ హోటల్ చౌరస్తా నుంచి లింగంపల్లి చౌరస్తా, సంగం హోటల్, మౌలానా ఆజాద్‌నగర్, చెప్పల్‌బజార్, నింబోలిఅడ్డా, కృష్ణానగర్, శ్యామ్‌నగర్, హర్రాస్‌పెంట, కబేళా వరకు ప్రధాన రోడ్లపై దాదాపు 150 మంది పోలీసులతో ఫ్లాగ్‌మార్చ్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎస్సైలు పి.రవికుమార్, నరేశ్, పోలీసులు పాల్గొన్నారు.

## వైద్య రంగంలో విప్లవాత్మక మార్పులు..



తెలంగాణ ప్రభుత్వం వైద్యరంగంలో విప్లవాత్మక మార్పులు తీసుకు వచ్చిందని ఖైరతాబాద్ జోన్ వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ పుట్ల శ్రీనివాస్ అన్నారు. గురువారం ఖైరతాబాద్ జోన్ నూతన డీఎంహెచ్ఓగా డాక్టర్ ఆయన బాధ్యతలు చేపట్టిన అనంతరం మాట్లాడుతూ.. నాణ్యమైన వైద్యాన్ని అందించాలనే లక్ష్యంతో ప్రభుత్వం వైద్యానికి అత్యంత ప్రధాన్యత ఇస్తుందని అన్నారు. సీనియర్ పబ్లిక్ హెల్త్ అఫీసర్ డాక్టర్ పద్మజ, యూపీహెచ్‌సీ ఆర్‌హెచ్‌ఎఫ్‌డబ్లూటీసీ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ ఎం. మనోజ్‌రెడ్డి పాల్గొన్నారు. – కాచిగూడ, నవంబర్ 16

# అభివృద్ధిచేసే పార్టీకి అండగా నిలవండి

● బీఆర్ఎస్ అభ్యర్థి ముఠా గోపాల్



ముషీరాబాద్ ఎన్నికల ప్రచారంలో భాగంగా కొబ్బరి బొండాం కొడుతున్న బీఆర్ఎస్ అభ్యర్థి ముఠా గోపాల్

ముషీరాబాద్, నవంబర్ 16: పేదల సంక్షేమం కోసం పాటుపడుతూ రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలోకి తీసుకువెళ్తున్న బీఆర్ఎస్ పార్టీకి ఓటర్లు అండగా నిలవాలని బీఆర్ఎస్ అభ్యర్థి, ఎమ్మెల్యే ముఠా గోపాల్ అన్నారు. ముషీరాబాద్ నియోజకవర్గంలో గత ఐదేండ్లలో బీఆర్ఎస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధిని చూసి వచ్చే ఎన్నికల్లో తనను భారీ మెజారిటీతో గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. గురువారం ఆయన అడిక్‌మెట్, ముషీరాబాద్ డివిజన్‌లలోని పలు బస్తీల్లో పార్టీ శ్రేణులతో కలిసి ఇంటింటికీ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. నేరుగా ఓటర్లను కలిసి ముఠా గోపాల్ మీ బస్తీల్లో రోడ్డు వేసింది, నిరంతరం కరెంటు, మంచి నీరు సరఫరా చేస్తున్నది గమనించి ఓట్లు వేయాలని కోరారు. ప్రజల మధ్య ఉండి నిత్యం ప్రజా హితం కోసం పరితపించే నేతను ఎన్నుకోవాలని కోరారు. తాను ఎమ్మెల్యే గెలిచిన తరువాత అడిక్‌మెట్ డివిజన్‌లో కోట్లాది రూపాయలు వెచ్చించి అభివృద్ధి పనులు చేపట్టినట్లు తెలిపారు. మూడు దశాబ్దాలుగా పరిష్కారం నోచుకోని లలితానగర్ డ్రైనేజీ సమస్యను పరిష్కరించిన ఘనత తమదేన్నారు. ప్రతి బస్తీలో రోడ్లు, మంచినీరు, డ్రైనేజీ సమస్యలను పరిష్కరించడంతో పాటు అర్హులైన వారికి పెన్షన్లు అందిస్తున్నామని, పని చేసే ప్రభుత్వానికి ఓటు ద్వారా మద్దతు తెలపాలని విజ్ఞప్తి చేశారు. దశాబ్దాలుగా పరిష్కారానికి నోచుకొని సమస్యలను పరిష్కరించిన ఘనత బీఆర్ఎస్ ప్రభుత్వానిదేనని, అభివృద్ధిని కొనసాగించడానికి బీఆర్ఎస్ గెలిపించుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ముషీరాబాద్ నియోజకవర్గం చరిత్రంతో ఎన్నడూ లేనివిధంగా వెయ్యి కోట్లకు పైగా నిధులు తీసుకువచ్చిన అభివృద్ధి పనులు చేట్టానని, వరద సమస్యలను పరిష్కరించిన ఘనత తనదేనన్నారు. నియోజకవర్గానికి ఎన్నికలప్పుడు వచ్చేపోయే నేతలు చెప్పే మాయమాటలు నమ్మవద్దని, పని చేసేటోళ్లకు ఎన్నికల్లో ఓటు వేసి గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ నాయకులు ముఠా జయసింహ, బి.శ్రీనివాస్‌రెడ్డి, నర్సింగ్‌ప్రసాద్, టి. సోమసుందర్, ఇంద్రసేనారెడ్డి, మాధవ్, కె. సురేందర్, రవియాదవ్, శ్యామ్‌సుందర్, చంద్రశేఖర్‌గౌడ్, నేత శ్రీనివాస్, మహ్మద్ ఖదీర్, రాజు, కిశోర్, సత్యనారాయణ, ప్రేమ్‌కుమార్, అనూరాధ, ప్రేమలతారెడ్డి, ఆకుల అరుణ్, శ్రీధర్‌రెడ్డి, ఎయిర్‌టెల్ రాజు, భిక్షపతి యాదవ్ తదితరులు పాల్గొన్నారు.



అడిక్‌మెట్‌లో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న ఎమ్మెల్యే అభ్యర్థి ముఠా గోపాల్

# బీఆర్ఎస్‌తోనే అభివృద్ధి సాధ్యం



గాంధీనగర్‌లో వై జంక్షన్ వద్ద బీఆర్ఎస్ అభ్యర్థి ముఠా గోపాల్‌కు మద్దతుగా ప్రచారం చేస్తున్న ముఠా జయసింహ

చిక్కడపల్లి, నవంబర్16 : బీఆర్ఎస్‌తోనే అభివృద్ధి సాధ్యం అవుతుందని బీఆర్ఎస్ యుజన విభాగం నాయకుడు ముఠా జయసింహ అన్నారు. ముషీరాబాద్ బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి ముఠా గోపాల్‌కు మద్దతుగా గురువారం గాంధీనగర్ డివిజన్‌లోని ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఆర్‌బీఐ క్వాటర్స్ నుంచి మొదలైన ప్రచారం హెబ్రోన్ చార్చి, వై జంక్షన్, గాంధీనగర్ బాలాజీ ఇంద్రప్రస్తా అపార్ట్‌మెంట్ వరకు ప్రచారం కొనసాగింది. ప్రచారంలో వందలాది నాయకులు కార్యర్తలు పాల్గొని కారు గుర్తుకే ఓటు వేసి ముఠా గోపాల్ గెలిపించాలని నినాదాలు చేస్తూ ప్రచారంలో ముందుకు సాగారు. ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాలను వివరిస్తూ కారు గుర్తుకే ఓటు వెయ్యాలని విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా ముఠా జయసింహ మాట్లాడుతూ.. దేశంలో ఎక్కడా లేని విధంగా రాష్ట్ర అభివృద్ధి, సంక్షేమ పథకాలను అమలు చేయడంతో బీఆర్ఎస్ పార్టీపై ప్రజలకు పూర్తి భరోసా ఉందన్నారు. ముషీరాబాద్ నియోజకవర్గంలో గడిచిన ఐదు సంవత్సరాల్లో ముఠా గోపాల్ ప్రతినిత్యం ప్రజలమధ్య ఉంటూ వారి సమస్యలు పరిష్కరించారని తెలిపారు. నియోజకవర్గాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేయడంతో పాటు ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలను అర్హులకు అందజేశారని తెలిపారు. ప్రజలు భారీ మెజార్టీతో ముఠా గోపాల్‌ను గెలిపిస్తారని ధీమా వ్యక్తం చేశారు. పార్టీ డివిజన్ అధ్యక్షుడు ఎం.రాకేశ్‌కుమార్, మాజీ కార్పొరేటర్ ముఠా పద్మ, పార్టీ సీనియర్ నాయకుడు బీఎన్ శ్రీనివాస్ యాదవ్, డివిజన్ ఇన్‌చార్జులు అజయ్‌ముదిరాజ్, బొట్టు శ్రీను, నాయకులు ముఠా నరేశ్, శ్రీనివాస్‌గుప్తా, న్యాయవాది ఇ. సాయి, రాజమోహన్, గడ్డమీది శ్రీనివాస్, రవి శంకర్ గుప్తా, ముఠా శివాసింహ, జీవై గిరి, ముఠా రామారాజ్, కిరణ్, సత్యనారాయణ. పాశం రవి, ఎస్టీప్రేమ్, శ్రీధర్‌రెడ్డి, అశోక్, జీవై గిరి, మిద్దె సురేశ్, భాస్కర్, దేవయ్య, హన్మంతు తదితరులు పాల్గొన్నారు.



గాంధీనగర్‌లో ఓటర్లకు మ్యానిఫెస్టోను అందజేస్తున్న డివిజన్ అధ్యక్షుడు రాకేశ్, మాజీకార్పొరేటర్ ముఠా పద్మ



గాంధీనగర్ డివిజన్ ఆంధ్రాకేఫ్ సమీపంలో ప్రచారం చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు గడ్డమీది శ్రీనివాస్ తదితరులు